కేసీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు

హుస్నాబాద్, ఫిబ్రవరి 18: మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. హుస్నాబాద్ నియోకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై కూడా ఆయన కేసీఆర్‌కు వివరించారు.

బీఆర్ఎస్ అధినేతను కలిసిన ఏకానందం

చేర్యాల, ఫిబ్రవరి 18: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆయన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉల్లెంగల ఏకానందం కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు



సతీశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 18: హుస్నాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడిచిన మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరిగినందున ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి కృపతో హుస్నాబాద్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు సుఖసంతోషాలతో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సతీశ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమాలో మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, బీఆర్ఎస్ నాయకులు గంగం మధుసూదన్‌రెడ్డి, వాల నవీన్‌రావు, బండి పుష్ప, పూదరి రవీందర్, రవీందర్ రావు, యాటకార్ల స్వరూప, గోనెల మధుకర్, బండి రమణారెడ్డి, భూక్యా రాజు, ఇంద్రాల సారయ్య, యాస శ్రీనివాస్, విజయభాస్కర్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పల్లా అండ

చేర్యాలలో చెక్కు అందజేస్తున్న శివగారి అంజయ్య తదితరులు

చేర్యాల, ఫిబ్రవరి 18: జనగామ నియోజకవర్గంలో అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అండగా ఉంటున్నారని చేర్యాల సబ్ డివిజన్ యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య తెలిపారు. మంగళవారం పట్టణానికి చెందిన సుద్దాల కన్నయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎమ్మెల్యే మంజూరు చేయించిన రూ.28,500 చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి చెక్కులు మంజూరు చేయించడంతో పాటు తన సొంత దవాఖానలో సైతం ఉచితంగా వైద్యం అందించి వారికి మందులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ టౌన్ అధ్యక్షుడు యాట భిక్షపతి, నాయకులు రాము, జంగిటి భిక్షపతి, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చిట్యాలలో...

మండలంలోని చిట్యాలకు చెందిన ఎండీ షర్ఫొద్దీన్‌కు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించిన రూ.30వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ నాయకులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, సిద్ధులు, రవి, రాజ్‌కుమార్, సంపత్, జంపయ్య, కనకయ్య, గణేశ్ పాల్గొన్నారు.

చేర్యాల ప్రాంత రైతులకు నీళ్లివ్వాలి

కొమురవెల్లిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి, ఫిబ్రవరి 18: తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా చేర్యాల ప్రాంతంలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల పరిధిలోని 53 గ్రామాల్లోని 133 చెరువులు నింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో కొమురవెల్లిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాస్‌పల్లి రిజర్వాయర్ ఈ సంవత్సరం నీళ్లులేక వెలవెలబోతుందన్నారు. రైతులు సాగు చేస్తున్న వరి పంట పొట్ట దశకు చేరుకుందని, ఈ సమయంలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయన్నారు. వెంటనే తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి దాని ద్వారా ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపాలన్నారు. కాంగ్రెస్ నాయకులు తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి నీళ్లు వస్తున్నాయని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, రైతులను మోసం చేసే మాటలు మానుకొని తక్షణమే నీటిని విడుదల చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకట్ మావో, యాదగిరి, అరుణ్ కుమార్, రవీందర్, కృష్ణారెడ్డి, ప్రశాంత్, శారద, షఫీ, తేలు ఇస్తారి, స్వర్గం శ్రీకాంత్, రవీందర్, బాలస్వామి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

చెక్కులు అందజేస్తున్న కుమార్‌యాదవ్

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 18: సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరమని బీఆర్ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ అన్నారు. కొండపాక మండలంలోని దుద్దెడకు చెందిన గాజులపాటి మధుకు రూ. 14,500, తిమ్మారెడ్డిపల్లికి చెందిన షేక్ మదార్‌కు రూ.58,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డికి లబ్ధిదారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము కనక నర్సింహులు, ఎండీ.ముజ్జు, గాధగోని రాకేశ్ గౌడ్ పాల్గొన్నారు.

నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు

కూటిగల్ నల్ల చెరువు వద్ద మాట్లాడుతున్న అధికారులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి18: చెరువులు, కుంటల్లో నీటి చౌర్యానికి పాల్పడితే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయించనున్నట్లు ధూళిమిట్ట ఇరిగేషన్ ఏఈ రమేశ్ హెచ్చరించారు. ధూళిమిట్ట మండలంలోని నల్ల చెరువు నుంచి కొంతమంది రైతులు మోటర్ల ద్వారా నీటిని పొలాలకు తరలిస్తున్నారని ఇటీవల స్థానిక మత్స్యకారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం తహసీల్దార్ సింహాచలం మధుసూదన్, ట్రాన్స్‌కో ఏఈ రాజుతో కలిసి ఇరిగేషన్ ఏఈ రమేశ్ నల్ల చెరువును సందర్శించి, నీటి తరలింపునకు వాడుతున్న మోటర్లను తొలగించారు. ఏఈ మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో చెరువు, కుంటల్లో నీటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. చెరువు, కుంటల్లో నీటి చౌర్యానికి పాల్పడేవారి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రవీందర్ ఇరిగేషన్, రెవెన్యూ, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 18: రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సాగు, తాగునీరు, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరా, రైతుభరోసా, యాసంగి సీజన్‌కు సాగునీటి సరఫరా, యూరియా కొరత, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన వంటి అంశాలపై ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యాచరణ రూపొందించాలన్నారు. సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. వ్యవసాయానికి, తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అర్హత గల ప్రతి రైతుకు రైతుభరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు గరీమాఅగర్వాల్, అబ్దుల్ హమీద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కృష్ణతేజ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 18: దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మున్సిఫ్‌కోర్టు జడ్జి కృష్ణతేజ్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేసిన అనంతరం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. దవాఖానకు ఎక్కువగా పేద, మధ్య తరగతి ప్రజలు వస్తుంటారని, వారికి సరైన వైద్య సేవలందించాలన్నారు. అంతకుముందు దవాఖానలోని పలు వార్డులను తిరిగి రోగులను పలకరించారు. గర్భిణులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, వైద్యులు జయంత్, రమాదేవి, రవికాంత్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

సిద్దిపేట: భవనాలకు కొలతలు వేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్

సిద్దిపేట, ఫిబ్రవరి 18: పట్టణ ప్రజలు పన్నులు సకాలంతో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ సూచించారు. పట్టణంలో నిర్మాణాలు పూర్తయిన ప్రతి భవనానికి ఇంటి నెంబర్ జారీ చేయాలని, కమర్షియల్ షెడ్లు, పెట్రోల్‌బంక్‌లు వంటి వాటికి ఇతర గోదామ్‌ల ఇంటి నెంబర్ లేకుండా ఉన్న వాటికి నెంబర్ జారీ చేయాలని ఆదేశించారు. మార్చి 31వరకు వందశాతం పన్ను వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో వ్యాపారులు ట్రేడ్‌లైసెన్స్ తీసుకోవాలన్నారు.

సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఇవ్వాలి

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో సిద్దిపేట పట్టణం జాతీయ స్థాయిలో మరోసారి మెరిసేలా ప్రజలు తమ వంతు సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ సూచించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో పురపాలక సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెత్త సేకరణ సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా తడి, పొడి, హానికర చెత్తను వేరు చేయడం, పారిశుధ్య నిర్వహణపై ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు.

55శాతం ఆస్తిపన్ను వసూలు

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 18: హుస్నాబాద్ పట్టణంలోఆస్తి పన్ను వసూలు కార్యక్రమాన్ని అధికారులు వేగవంతం చేశారు. పట్టణంలో ఆస్తి పన్ను వసూళ్ల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ ఆర్ఐ కనకయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలో 55.70 శాతం ఆస్తిపన్ను వసూలు చేసినట్లు ఆయన తెలిపారు.

అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలి

చేర్యాల, ఫిబ్రవరి 18: ఎమ్మెల్సీ ఎన్నికల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు పోటీ చేస్తున్నారని వారి వల్ల ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.తిరుపతిరెడ్డి విమర్శించారు.ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపకులు ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని మంగళవారం పట్టణంలో ఇంటింటా తిరిగి ఉపాధ్యాయులను కలిసి కోరారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మరోసారి అలుగుబెల్లి పోటీచేస్తున్నారని, ఆయన్ను గెలిపించడం వల్ల విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మె ల్సీ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి అశోక్‌కుమార్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాంరెడ్డి, ప్రశాంత్ కుమార్, వెంకటరమణ, పిల్లి రాజు, హనుమారెడ్డి, చంద్రారెడ్డి, శ్రీనివాస్, సుధాకర్, ఐలయ్య, కొండల్‌రెడ్డి, నరహరి, శ్రీనివాస్‌రెడ్డి, స్వరూపారాణి, గోవిందరాజులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేయాలి



మిరుదొడ్డిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రొఫెసర్ చెన్న కృష్ణారెడ్డి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 18: పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి ప్రొఫెసర్ చెన్న కృష్ణారెడ్డి కోరారు. మంగళవారం మిరుదొడ్డి టౌన్‌లో పట్టభద్రులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను ఓటు వేసి గెలిపిచాలని ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మాటలను నమ్మకుండా పట్టభద్రులు తనకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టభద్రులు ఐలయ్య, సంపత్, సాయికుమార్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తుల నిరసన

బేగంపేటలో నిరసన చేస్తున్న గ్రామస్తులు

బెజ్జంకి, ఫిబ్రవరి 18: మండల కేంద్రం నుంచి బేగంపేట మీదుగా వేస్తున్న రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. బేగంపేట గ్రామస్తులు మంగళవారం గ్రామంలోని కూడలి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంకరవేసి రోడ్డు నిర్మాణం ఆపివేయడంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ సర్పంచ్‌లు సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు ఎల శేఖర్‌బాబు, కొరివి లక్ష్మయ్య, మల్లయ్య, సంపత్, చంద్రమౌళి, పోచమల్లు, రాజయ్య, రమేశ్, సంతోష్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 18: యోగాతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొమటిబండ పాండవ కృష్ణ ధాన్యక్షేత్ర వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ మానసిక ఒత్తిడి ఉంటుందని, అందుకు యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. యోగా, ధాన్యంపై గజ్వేల్ పట్టణంలో పాటు ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పిరమిడ్ ట్రస్టు సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, నిర్వాహకులు నర్సింహులు, బాల్‌రెడ్డి, రాజిరెడిడ, వెంకట్రావ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ప్రజల రక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

చేర్యాలలో మాట్లాడుతున్న సీఐ శ్రీను

చేర్యాల, ఫిబ్రవరి 18: ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు తెలుసుకోవడం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశమని సీఐ శ్రీను తెలిపారు. ప్రజల రక్షణ, ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీ భద్రతాభావం కల్పించడం గురించి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చేర్యాల పట్టణంలోని పెద్దమ్మగడ్డ ప్రాంతంలో చేపట్టినట్లు తెలిపారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నార్కోటిక్స్ డాగ్స్ అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి పేపర్లు లేని 22 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని, వాటికి సంబంధించిన పత్రాలు చూపించి తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో చేర్యాల, కొమురవెల్లి,మద్దూరు ఎస్సైలు నిరేశ్, రాజు, షేక్ మహబూబ్, ప్రొహిబిషనరీ ఎస్సై మానసరెడ్డి, పోలీస్ సిబ్బంది, డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత

స్కాలర్‌షిప్ అందుకుంటున్న చేర్యాల విద్యార్థులు

చేర్యాల, ఫిబ్రవరి 18: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న తొమ్మిది మంది బాలికలు మలబార్ గోల్డ్ స్కాలర్‌షిప్ (సిద్దిపేట) అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.జ్యోతి మంగళవారం ప్రకటనలో తెలిపారు.2024-25 విద్యా సంవత్సరానికి కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులు యాట అశ్విని(చుంచనకోట), గదరాజు పల్లవి(కడవేర్గు), కాసార్ల అనుష్క(ముస్త్యాల),కెమ్మసారం బాలలక్ష్మి(అర్జునపట్ల), బాలగోని మహాలక్ష్మి(చేర్యాల), మల్లం శిరీష(అయినాపూర్), నీల అర్చన(అయినాపూర్), యాసవేని రాజేశ్వరి(పడమటి కేశవపూర్), సైని(నాగపురి) ఒక్కొక్కరు రూ. 10వేల చొప్పున మలబార్ గోల్డ్ స్కాలర్‌షిప్ అందుకున్నట్లు తెలిపారు. చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునేందుకు ముందుకు వచ్చే విద్యార్థులకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.మధు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

రెడ్యానాయక్‌తండాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహబూబ్

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి18: గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ అన్నారు. మంగళవారం ధూళిమిట్ట మండలంలోని రెడ్యానాయక్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలో సైబర్ నేరాలు, శాంతిభద్రతలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో గొడవలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మూఢనమ్మకాలు, సాంఘిక దురాచారాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రసన్న హరికృష్ణను గెలిపించుకుందాం

హుస్నాబాద్‌లో హరికృష్ణకు మద్దతుగా ప్రచారం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 18: పట్టభద్రుల ఎమ్మెల్సీఅభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణను గెలిపించుకుందామని దళిత, బహుజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. హుస్నాబాద్‌లో మంగళవారం వారు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీసంఘాల రాష్ట్ర నాయకుడు కొయ్యడ కొమురయ్య, దళిత సంఘాల నాయకుడు లింగాల సాయన్న మాట్లాడుతూ అణుగారిన వర్గాలకు న్యాయం చేసేందుకు హరికృష్ణ ఎమ్మెల్సీగా పోటీచేస్తున్నారన్నారు. విద్య, వ్యాపార రంగాల్లో కోట్ల రూపాయలు దండుకున్న వ్యక్తులు ఓట్ల కోసం తిరుగుతున్నారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. బీసీ, దళితసంఘాల నాయకులు వడ్డెపల్లి మల్లేశం, సుధాకర్, బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, సుధాకర్, వెంకటేశ్, వెంకటస్వామి, సునీత, సుధాకర్ పాల్గొన్నారు.

కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి

- **అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్**

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్

కోహెడ, ఫిబ్రవరి 18: కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్ అన్నారు. మంగళవారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలో పరిశుభ్రత, టాయిలెట్స్ నిర్వహణ, భోజన వసతి, విద్యార్థుల ఆరోగ్యం, నీటి సరఫరా, తాగునీటిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి ఆసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల విద్యాస్థాయిని పరిశీలించడం కోసం టెన్త్ విద్యార్థుల తరగతికి వెళ్లి గణితానికి సంబంధించి బోర్డుపై లెక్కలు చేయించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సురేఖ, ఎంఈవో పద్మయ్య, వైద్యాధికారి నిమ్రా, ఎంపీవో శోభ, సీడీపీవో జయ, సూపర్‌వైజర్ కవిత, పంచాయతీ కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

మల్లన్న ఐదో ఆదివారం ఆదాయం రూ.48,10,683

చేర్యాల, ఫిబ్రవరి 18 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఐదో ఆదివారం ఆదాయం రూ.48,10,683 వచ్చినట్లు ఆలయ ఈవో కె.రామాంజనేయులు తెలిపారు. శనివారం రూ. 2,84,716, ఆదివారం రూ. 39,19,799, సోమవారం రూ. 6,06,168 ఆర్జిత సేవలు, బుకింగ్ తదితర వాటి ద్వారా సమకూరినట్లు తెలిపారు. గత సంవత్సరం ఐదో ఆదివారం రూ. 56,03,330 రాగా ఈ సంవత్సరం రూ. 48,10,683 ఆదాయం వచ్చిందన్నారు.

ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 18: విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని టీవీఏసీ జేఏసీ ఉమ్మడి మిరుదొడ్డి మండల అధ్యక్షుడు అన్నెబోయిన నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మిరుదొడ్డిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థలో 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆర్టిన్ కార్మికులను వారి అర్హతను బట్టి సబ్ ఇంజినీర్, జేఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్‌పోస్టుల్లో నియమించాలన్నారు. సమస్యల సాధనకు ఈ నెల 20న విద్యుత్ కార్మికులు చలో విద్యుత్ సౌధ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చట్ట వ్యతిరేక పనులు చేస్తే చర్యలు

చేర్యాల, ఫిబ్రవరి 18: గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై నిరేశ్ తెలిపారు. మండలంలోని దానంపల్లి, చిట్యాల గ్రామాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ స్థానిక ఎన్నికల సందర్భంగా ప్రజలు కలిసిమెలిసి ఉండాలన్నారు. ఎన్నికలను అడ్డం పెట్టుకుని గొడవలకు పాల్పడవద్దన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్100కు కాల్ చేయాలని కోరారు.

నిరుద్యోగ పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

రేణుకా ఎల్లమ్మ సన్నిధిలో పూజలు చేస్తున్న రాజు

హుస్నాబాద్, ఫిబ్రవరి 18: నిరుద్యోగ పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పిడిశెట్టి రాజు కోరారు. మంగళవారం హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పట్టణంలోని పలు కాలనీల్లో పట్టభద్రులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో మూడు లక్షలకు పైగా ఉన్న ఓటర్లలో 75శాతం బీసీలు ఉన్నారని చెప్పారు. బీసీలకు రాజ్యాధికారం రావాలంటే బీసీ అభ్యర్థిని అయిన తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు నాంపల్లి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మకు నివాళి

భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 18: అణుగారిన వర్గాల హక్కుల కోసం గళమెత్తిన గొంతుక భాగ్యరెడ్డివర్మ అని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండస్వామి, డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. మంగళవారం ఆయన వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు మైసయ్య, శ్రావణ్, లింగం, శేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

బెజ్జంకి, ఫిబ్రవరి 18: మండలంలోని గుండారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఎలుకంటి శ్రీనివాస్‌రెడ్డి ప్రింటర్‌ను మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు ప్రింటర్ కావాలని ఉపాధ్యాయులు కోరగా అందించినట్లు చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, నాయకులు దేవయ్య, పుల్ల పోచయ్య, సంపత్ పాల్గొన్నారు.